

సీఎం పర్యటన ఏర్పాట్లపై మలకపల్లిలో కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో పరిశీలన

రేపు మలకపల్లిలో సీఎం పర్యటన

- ఇంటి వద్దనే పింఛన్లు..గ్రామసభ నిర్వహణ
- పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

కొవ్వూరు/తాళ్లపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం (జూలై 1) పర్యటిస్తారన్నారు.కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సీఎం పర్యటనపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు.లబ్ధిదారులకు ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.అనంతరం నిర్వహించే గ్రామసభలో పీ 4 పథకం మార్గదర్శులు..లబ్ధిదారుల కుటుంబాలతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. గ్రామ సభ నిర్వహణ, హెలిప్యాడ్, రూట్‌మ్యాప్,మెడికల్‌క్యాంపు ఏర్పాటు, అగ్నిమాపకం, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. గ్రామసభ వేదిక నుంచి సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సభావేదిక, హెలిప్యాడ్ ఏర్పాట్లను పూర్తిచేసి భద్రతా సిబ్బందికి వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్,ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఎస్పీ డి.నరసింహకిశోర్, జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి,డీఎస్పీ జి.దేవకుమార్,ఆర్డీవో రాణి సుస్మిత,సీపీవో ఎల్.అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ,హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, డీటీసీ ఆర్.సురేష్, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి, మద్దిపట్ల శివరామకృష్ణ,మద్దిపాటి ప్రకాశం, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి, తహశీల్దార్లు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సమన్వయ సమావేశానికి హాజరైన అధికారులు

కూటమి నేతలే..
సారథులు



సొసైటీలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటు

- నాయకుల వద్ద జాబితాలు
- జిల్లాలో 298 సొసైటీలు
- ప్రతి సొసైటీకి ముగ్గురు
- 894 మందికి అవకాశం
- తుది దశకు చేరిన కసరత్తు
- త్వరలోనే ఉత్తర్వులు విడుదల
- వివరాలు పంపాలని ఆదేశాలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించనున్నారు. ఈ కసరత్తు చివరి దశకు చేరుకోవడంతో పాటు నిర్ణీత నివేదికలో వివరాలు పంపాలని జిల్లా సహకార అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ వారంలోనే పర్సన్ ఇన్‌చార్జి కమిటీలకు చెందిన ఉత్తర్వులు జారీ కానున్నాయి. వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా మారిన సొసైటీలను గాడిలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కూటమి నేతలతో త్రిసభ్య కమిటీలు ఏర్పడగానే ఆయా సొసైటీల్లో గతంలో జరిగిన వ్యవహారాలపై దృష్టి పెట్టి, ఎక్కడైనా అవకతవకలు జరిగితే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. డీసీసీబీలు, డీసీఎంఎస్‌లు, సొసైటీలను పూర్తిగా ప్రక్షాళన చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 298 సొసైటీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 298 ప్రాథమిక విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సొసైటీలు) ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 72, తూర్పుగోదావరి జిల్లాలో 49, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 166, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 సొసైటీలు ఉండగా వీటి పదవీకాలం గత వైసీపీ ప్రభుత్వ పాలనలోనే ముగిసింది. అప్పటి నుంచీ సొసైటీలు, డీసీసీబీలు,డీసీఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించలేదు. గడువు ముగిసిన సొసైటీలన్నింటికీ త్రిసభ్య కమిటీలను నియమించారు. వైసీపీ నేతలతో సొసైటీలను నింపేశారు. నాలుగేళ్ల పాటు ఎన్నికలు జరపకుండా ఆరు నెలలకోసారి వీటి గడువు పెంచుకుంటూ వెళ్లారు. దీంతో సొసైటీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. పలు సొసైటీల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి.

ప్రస్తుతం అధికారుల పాలనే..

వైసీపీ పాలనలో నియమించిన త్రిసభ్య కమిటీల సభ్యుల్లో కొందరు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజీనామా చేశారు. మిగిలిన వారిని ప్రభుత్వం తొలగించింది. డీసీసీబీ, డీసీఎంఎస్‌లతో పాటు సొసైటీలకు సహకారశాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. ఒక్కొక్క అధికారికి కనిష్ఠంగా రెండు నుంచి గరిష్ఠంగా ఐదు సంఘాల బాధ్యతలు అప్పగించడంతో సొసైటీల్లో పర్యవేక్షణ తగ్గడంతో పాటు కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బం దులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వీరి గడువు ఈ నెల 26-28 తేదీల మధ్య ముగియగా జూలై 31 వరకు మాత్రమే పొడిగించారు. ఈ మేరకు త్రిసభ్య కమిటీల ఎంపికను వేగవంతం చేశారు.

కమిటీల నియామకంపై కసరత్తు

సహకార సంఘాల వ్యవస్థలో కీలకమైన డీసీసీబీలు, డీసీఎంఎస్‌లకు కూటమి నేతలను చైర్మన్లుగా నియమించింది.డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు,డీసీఎంఎస్ చైర్మన్‌గా పెచ్చెట్టి చంద్ర మౌళి ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. వీటికి పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకంపై కసరత్తు తుది దశకు చేరింది.కూటమి నేతలు ప్రతి సొసైటీకి చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులను ప్రతిపాదించారు. ఆయా నియోజకవర్గాల బాధ్యులు వీటి పేర్లను ఇప్పటికే పంపినా నేతల మధ్య అభిప్రాయభేదాల కారణంగా జాప్యం చోటు చేసుకుం ది. ఈ పదవులకు కూటమి నేతలు పోటీపడడంతో సర్దుబాటుకు ఇబ్బందులు తప్పలేదు.

ఎదురుచూపులు..

సొసైటీలకు ప్రతిపాదించిన త్రిసభ్య కమిటీల(చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లు)కు సంబంధించిన పూర్తి వివరాలు పంపాలని సహకారశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందుకు 18 అంశాలతో కూడిన నివేదికను అధికారులకు పంపారు.ప్రస్తుతం నివేదికలో వివరాలను ఆయా సొసైటీల సీఈవో లేదా కార్యదర్శుల నుంచి సేకరించి ప్రభుత్వానికి పంపడంలో ఉమ్మడి జిల్లా సహకార అధికారులు నిమగ్నమయ్యారు. ఈ వివరాలన్నీ జిల్లాల నుంచి ప్రభుత్వానికి చేరగానే వారం వ్యవధిలోనే త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అవుతాయని భావిస్తున్నారు. త్రిసభ్య కమిటీల నియామకంపై ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా నియామకానికి కూటమిలోని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు నియామక ఉత్తర్వులు రాకపోవడంపై వారిలో కొంత అసంతృప్తి ఉంది.త్రిసభ్య కమిటీల నియామక కసరత్తును దాదాపు నాలుగు నెలల కిందట ప్రారంభించారు.ఎంతకీ ఆదేశాలివ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్,డైరెక్టర్లుగా నియమితులైన వారుఎన్నికలకు సన్నద్ధం కావాల్సి ఉంటుంది.

వస్తున్నాయ్..
ఈ-బస్‌లు!



ఉమ్మడి జిల్లాలో పల్లెబాట పట్టనున్న ఏసీ బస్‌లు

- కాకినాడ,రాజమండ్రికి బస్‌లు
- 100 బస్‌లు తెచ్చే యోచన
- కోనసీమకు రెండో విడత
- చార్జింగ్ పోర్టుల నిర్మాణం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు..ఆర్టీసీలో కొత్త బస్సులను చూసి ఎన్నేళ్లయిందో.. చాలా కాలంగా డొక్కు బస్సులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొత్త బస్సులకు చోటు లేదన్నట్టు పాత బస్సులనే అరగదీశారు..అయితే ప్రభుత్వం మారింది.. కొత్త బస్సులకు మార్గం సుగమమైంది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ బస్సులు (ఈవీ) పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే బస్సులు తిరగాల్సిన రూట్ల ను ప్రతిపాదించారు.ఎలక్ట్రికల్ బస్సు లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

2 జిల్లాలు.. 100 బస్‌లు..

కేంద్ర ప్రభుత్వ పథకంలో రాజమండ్రికి 50, కాకినాడకు 50 బస్సులు ఆరు నెలల్లో రానున్నాయి. వీటిని ప్రైవేటు ఆపరేటర్లు నడుపుతారు. ఇప్పుడు ప్రైవేటు ఆర్టీసీ బస్సుల మాదిరిగానే..డ్రైవరు, నిర్వహణ ఆయా యజమానులు చూసుకుంటారు. చార్జింగ్ పోర్టులకు అవసరమైన స్థలం, డ్రైవర్లకు రెస్ట్ రూంల వంటివి ఆర్టీసీ కల్పిస్తుంది. చార్జీలు ప్రభుత్వ నిర్ణయం మేరకే ఉంటాయి. ఒక్కో బస్టాండ్‌లో దాదాపు 10 చార్జింగ్ పోర్టులను ఏర్పాటు చేస్తుండగా..వాటికి సబ్-స్టేషన్ల నుంచి నేరుగా ప్రత్యేక లైను వేస్తున్నారు. ఏసీ బస్సులు కాబట్టి చార్జీలు ప్రస్తుతం కంటే కాస్త ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా డిపోలకు కేటాయించే బస్సుల్లో 12 మీటర్ల పొడవుతో 32, 9 మీటర్ల పొడవుతో 18 బస్సులు ఉండనున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమల్లో వెయ్యి బస్సుల వరకూ ఉండగా 40 శాతం అద్దె బస్సులు ఉన్నాయి. విద్యుత్ బస్సులు వచ్చిన తర్వాత మొరాయి స్తున్న బస్సులను పక్కన పెట్టే ఆలోచనలో ఆర్టీసీ ఉంది. డీజిల్‌తో నడు స్తున్న బస్సులకు కిలోమీటరుకు రూ.8 నుంచి రూ.20 వరకూ ఉన్న నిర్వహణ ఖర్చులు ఈవీలతో తగ్గుతాయి.

రూట్లు ఇవే!

కాకినాడ డిపోకు సంబంధించి కాకినాడ- రాజమండ్రి నాన్‌స్టాప్, అమలాపురం, రాజమండ్రి వయా ద్వారపూడి, విశాఖపట్నం, విజయవాడ, బిక్కవోలు.. రాజమండ్రి డిపోకు సంబంధించి కాకినాడ నాన్‌స్టాప్, కాకినాడ(వయా బిక్కవోలు, రాజానగరం), విజయవాడ, అమలాపురం, గోకవరం, గోకవరం సింగిల్‌స్టాప్ రూట్లను ప్రతిపాదించారు.

కేంద్రం పథకంలో బస్‌లు..

కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఈ-బస్ సేవా పథకంలో కన్వర్జెన్సీ ఎనర్జీ సర్వీసెస్ (సీఈఎస్)తో కలిపి మొదటి దశలో రాజమహేంద్రవరం, కాకినాడకు 50 చొప్పున, అమలాపురానికి రెండో దశ లో ఈవీలు రానున్నాయి. ఆయా డిపోల్లో ఇప్పటికే చార్జింగ్ పోర్టులకు స్థలాలను కేటాయించారు. పూర్తిగా ఈకో ఫ్రెండ్లీ బస్సులు కావడంతో వాయు, శబ్ద కాలుష్యం మాటే ఉండదు. గ్రామీణ ప్రజలు కూడా పల్లె వెలుగు ఏసీ బస్సుల్లో ఎంచక్కా మంచి ప్రయాణ అనుభూతిని పొందవచ్చు. మొరాయిస్తున్న బస్సులతో కుస్తీలు పడుతున్న అధికారులకు, ఒళ్లు నొప్పుల నుంచి ప్రయా ణికులకు ఉపశమనం కలగనుంది. ఇకపై ఆర్టీసీలో ఈ-బస్సులే కొనాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.ఈ-బస్సులకు కేంద్రం రూ.35 లక్షలు నేరుగా రాయితీ ఇస్తోంది.

సౌకర్యవంతమైన ప్రయాణం..



ఎలక్ట్రికల్ బస్సులు పర్యావరణ హితం. పల్లె వెలుగు బస్సులకు ఏసీ ఉంటే గ్రామీణులు సంతోషిస్తారు. సౌకర్యవంతంగా ప్రయాణా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగానే రూట్లను ప్రతిపాదించడం జరిగింది.

- సత్యనారాయణ మూర్తి, డీపీటీవో

ప్రయాణం సుఖవంతమే కానీ..

ఎలక్ట్రికల్ బస్సులను డీజిల్ బస్సుల మాదిరిగా తిప్పడానికి వీలు పడకపోవచ్చు. గోతుల రోడ్లలో వీటిని తిప్పితే మూణ్ణాళ్ల ముచ్చట కిందే పరిస్థితి ఉంటుంది.ఒకసారి చార్జింగ్ చేయడానికి 45 నిమిషాలు పడుతుంది. ఆ చార్జింగ్‌తో పరిమిత వేగంలో నడిపితే గరిష్ఠంగా 180 కిలోమీటర్ల వరకూ పరుగులు పెడుతుంది. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించ డానికి ఇబ్బందే. ఉదాహరణకు విజయవాడ వెళితే అక్కడ మళ్లీ 45 నిమిషాలు చార్జింగ్ పెట్టుకొని బయలుదేరాల్సి ఉంటుంది. విశాఖ వెళ్లడానికి ఆలోచించాల్సిందే. ఎలక్ట్రికల్ బస్సులను ఆయా ప్రతిపాదిత రూట్లలో ట్ర యల్ రన్‌గా కొద్ది రోజులు నడిపితే బాగుం టుందని ప్రయాణికులు అంటున్నారు. ఈవీ బస్సులు కాలం గడిచే కొద్దీ బ్యాటరీల సామ ర్థ్యం తగ్గడం ఉంటుందని చెబుతున్నారు.

కొత్త మెనూ..
అమలు చేస్తున్నాం

- ఎంఎస్ శోభారాణి, డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్, కాకినాడ



ఇంటర్వ్యూ

జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్సీ హాస్టళ్లలో అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూలో కూడా మార్పులు చేపట్టామని జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ శోభారాణి తెలిపారు. పలు అంశాలపై ఆమె ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాట్లాడారు. అవేంటో తెలుసుకుందాం..

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి? విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?

జవాబు: జిల్లావ్యాప్తంగా 20 బాలుర వసతి గృహాలు, 13 బాలికల వసతిగృహాలుఉన్నాయి. వీటిలో బాలురు 1581మంది, బాలికలు 833 మంది మొత్తం 2414మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

ప్రశ్న: హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి?

జవాబు: వార్డెన్స్ అందరూ సమయపాలన పాటిస్తున్నారు. బయోమెట్రిక్ ద్వారా మూడు పూటలు అటెండెన్స్ వేస్తున్నారు. వారు చేస్తున్న యాక్టివిటీస్ కూడా మూడు పూటలా సంక్షేమ అధికారులకు క్రమం తప్పకుండా ఫొటోస్ అప్లోడ్ చేస్తున్నారు.

ప్రశ్న: కొత్త భవనాలు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయి?

జవాబు: శంఖవరం, కత్తిపూడి, తునిల్లో శిథిలావస్థలోని భవనాల స్థానంలో ప్రభుత్వం డీఎంఎఫ్ నిధులు రూ.1.77కోట్లతో భవనాలను నిర్మిస్తోంది. 2025- 26 విద్యా సంవత్సరానికి మూడు నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయి. జగన్నాథపురం సోషల్ వెల్ఫేర్ కాలేజీ, బాలికల హాస్టల్ రిలయన్స్ సీఎస్ఆర్ నిధులు రూ.63లక్షలతో నిర్మించిన భవనం వినియోగంలోకి వచ్చింది.

ప్రశ్న: హాస్టళ్ల నిర్వహణకు సంబంధించి బడ్జెట్ పరంగా ఇబ్బందులు ఉన్నాయా?

జవాబు: డైట్ చార్జీలకు, విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు డ్రా చేశాం. ఇబ్బందులు లేవు.

ప్రశ్న: మెనూప్రకారం భోజనం ఇస్తున్నారా?

జవాబు: జిల్లాలోని అన్ని హాస్టళ్లలో నూతన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. ఉదయం పాలు, అల్పాహారం.. మధ్యాహ్నం స్నాక్స్, మధ్యాహ్నా భోజనం.. సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం, స్నాక్స్ ఇస్తున్నాం.

ప్రశ్న: హాస్టళ్లలో కనీస సౌకర్యాలు అందుబాటులో లేవనే విమర్శలున్నాయి?

జవాబు: హాస్టళ్లలో కనీస అవసరాలకు ప్రభుత్వం రూ.1.23కోట్లు మంజూరు చేసింది. వాటితో జిల్లాలోని 13 హాస్టళ్లలో మేజర్, మైనర్ వర్కులతోపాటు మరమ్మతులు చేశాం. ప్రైవేట్ హాస్టళ్ల అద్దె బకాయిలు చెల్లించాం.

-ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్(కాకినాడ)



దిగుమతి సుంకం
పిడుగు

- పామాయిల్ రైతులపై భారం
- దిగజారుతున్న గెలల ధర

సామర్లకోట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలతో మురిసిపోతున్న పామాయిల్ రైతులపై దిగుమతి సుంకం పిడుగుపడింది. ఈనెలలో టన్ను పామాయిల్ గెల ధర రూ.16,400కు తగ్గిపోయింది. నాలుగు నెలలుగా గెలల ధర తగ్గుతూ ఇప్పుడు రూ.20వేల దిగువకు జారిపోయింది. ఫిబ్రవరిలో టన్ను గెలల ధర రూ.20,950 కాగా ఏప్రిల్ నెలలో రూ.20,290 ఉన్న ధర నేడు రూ.18,650 వద్ద స్థిరపడింది. ఈ ధర మరింత దిగజారే ప్రమాదకర పరిస్థితులున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా వడ్డిస్తే తట్టుకోలేరని మెల్లిగా తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ధరల దిగజారుడుకు ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20నుంచి 10శాతానికి తగ్గించడమేనని తెలుస్తోంది. 2023, అక్టోబరులో దిగుమతి సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించినప్పుడు పామాయిల్ గెలలు టన్ను ధర ఒక్కసారిగా రూ.11,977కు పడిపోయింది. 2022, మే నెలలో 19శాతం దిగుమతి సుంకం ఉన్నప్పుడు అత్యధికంగా పామాయిల్ గెలల ధర రూ.23,365కు పలికింది. ఈ ధర కారణంగానే పామాయిల్ తోటల విస్తీర్ణం అనూహ్యంగా పెరుగుతుండడం మొదలైంది. తరచూ దిగుమతుల సుంకాల హెచ్చుతగ్గుల కారణంగా పామాయిల్ పంట సాగుపై కొందరు రైతులు పెదవి విరుస్తున్నారు. కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ధర నిర్ణయ కమిటీ పామాయిల్ సాగు టన్నుకు రూ.22వేల వరకూ ఖర్చవుతుందని అంచనాలు వేసింది. ఏటా రూ.60వేలకోట్ల విలువైన పామాయిల్‌ను కేంద్రందిగుమతి చేసుకుంటోంది. దీనినుంచి బయటపడేందుకు ఇటీవల పామాయిల్ సాగును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అమలు చేస్తోంది. దీంతో ఉచితంగా మొక్కలు,ఎరువులు లభిస్తున్నాయి.

జిల్లాలో పామాయిల్ సాగు విస్తీర్ణం ఇదే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 81వేల ఎకరాల్లో పామాయిల్ పంటసాగుచేస్తూ రాష్ట్రంలోనే పామాయిల్ సాగు చేసే జిల్లాల్లో ద్వితీయస్థానాన్ని చేరింది. ఎకరాకు 9 నుంచి 10 టన్నుల దిగుబడి చొప్పున ఏటా 81 వేల టన్నుల మేర పామాయిల్ గెలలు దిగుబడి అవుతాయని తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా సాగుచేస్తున్న పామాయిల్ తోటల రైతులందరూ సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఉన్న ప్రైవేట్ పామాయిల్ కంపెనీకి సరఫరా చేస్తుంటారు.

రూ.25 వేలు ఇవ్వాలి

దేశం వంటనూనెల దిగుమతి నుంచి బయట పడాలంటే పామాయిల్ సాగును ప్రోత్సహించడం తప్ప వేరే మార్గం లేదు. సాగు పెరగాలంటే పంటకు తగిన గిట్టుబాటు ధర ఉండాలి. ఈ కారణంగా టన్నుకు రూ.25 వేలు ధర ఉంటే రైతులకు, ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. కనీసం పెట్టుబడి ధర రూ.22వేలకు తగ్గ కుండా కనీస మద్దతు ధర ప్రకటించాలి.

-పుట్టా సోమన్నచౌదరి, అభ్యుదయ పామాయిల్ రైతు

2న ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

రగ్బీలో జిల్లా జట్టుకు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం

7

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారంఉదయం 10గంటలకు యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన వెలువరించారు. కార్యక్రమానికి జిల్లాస్థాయిఅధికారులు విధిగా హాజరుకావాలన్నారు. అర్జీదారులు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు.

ఆరుగురికి ఉద్యోగోన్నతి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్‌ల్లో పనిచేస్తున్న ఆరుగురికి ఉద్యోగోన్నతి లభించింది. ఐఎన్ శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా, సీహెచ్ఎస్ఎం ప్రకాష్ సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా, ఏవీవీఎస్ఎన్ మూర్తి జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా, కె.లాజర్ జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా, వై.నాగలక్ష్మి జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా, జి.వీరశేఖరరెడ్డి పంచాయతీ గ్రేడ్-1 సెక్రటరీ నుంచి డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందారు. వారికి కేటాయించిన మండలాలకు బదిలీ కానున్నారు.

కరప బాలిక
ఆచూకీ లభ్యం

- డిప్యూటీ సీఎం చొరవతో దర్యాప్తులో వేగం 7
- యువకుడిపై పోక్సో కేసు

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programs at selected private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree or diploma program in architecture and engineering, such as Mechanical Engineering, Electrical Engineering & Electronics Engineering and production Engineering, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in selected colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh.



Prizes & Rewards:

- For engineering and architecture students: INR 1,00,000 or 75% of the annual fees (whichever is less)
- For diploma students: INR 40,000 or 90% of the annual fees (whichever is less)

Last Date: 15-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/BSFS4

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: "Students enrolled in the BBA, BFIA, B.Com. (H,E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RMKSP5

buddy4study.com

నిన్న మొన్నటి దాకా ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల మొదటి చాయిస్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. మార్కెట్‌లో ఉద్యోగాలు తగ్గడం మొదలయ్యాయి. పులిమీద పుట్రలా అమెరికా జాబ్ మార్కెట్ ఇబ్బందులతో మరింత క్షీణించింది. దీంతో సీఎస్సీ చదవాలనే విద్యార్థుల ఆలోచనలు మారి కోర్ సబ్జెక్టుల వైపు దృష్టి సారించడం మొదలుపెట్టారు. అంతే కాకుండా విద్యార్థులను ఇటువైపు మళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్ బ్రాంచెస్‌లు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణారావు**. ఆయన గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా పనిచేశారు.



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

● అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్ కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.

● భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సాఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా ఇలా పలు సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు

దిక్సూచి

ఎస్ఎస్‌సీ కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ, గ్రాడ్యుయేట్ లెవెల్ నోటిఫికేషన్

గ్రాడ్యుయేట్ లెవెల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని 14,582 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కొన్ని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 జూలై 4

ఎంపిక విధానం:

- టైర్-1 సీబీటీ ఆబ్జెక్టివ్ పరీక్ష
- టైర్-2 సీబీటీ - ఆబ్జెక్టివ్ పరీక్ష + స్కిల్ టెస్టులు
- డాక్యుమెంట్ వెరిఫికేషన్

వెబ్‌సైట్: https://ssc.gov.in/



కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పూర్తిచేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 3131 ఖాళీలు ఉన్నాయి

- లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
- డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఏ)

అర్హత: ఇంటర్మీడియేట్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ విద్యార్థులూ అర్హులు. కొన్ని పోస్టులకు మాత్రం ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1999 జనవరి 1 నుంచి 2008 జనవరి 1వ తేదీన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 15 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 18

వెబ్‌సైట్: https://ssc.gov.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మధ్యతరగతి కుటుంబాల కథ



సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని ప్రధాన పాత్రల్లో శ్రీ గణేశ్ తెరకెక్కించిన చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బేనర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. జూలై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ' తండ్రీకొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. అలాంటి అనుబంధాన్నే ఇప్పుడు '3బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు' అని అన్నారు. నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'మనమందరం మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చాం. ఇల్లు కట్టుకోవాలనే కల అందరికీ ఉంటుంది. ఇల్లు అనేది ఒక గౌరవం. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కూర్చొని చూడదగిన చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు శ్రీ గణేశ్ మాట్లాడుతూ 'మా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ 'ఈ చిత్రం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

భారతీయ సినీరంగం గర్వించే విషయం

- పవన్‌కల్యాణ్



హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.

సీక్వెల్ రాబోతోంది





యూత్‌ను విపరీతంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ కథానాయకుడిగా తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ చిత్రానికి కొనసాగింపు భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకు సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు మేకర్స్ 'ఈఎన్ఈ రిపీట్' అనేది టైటిల్. 'ఏలినాటి శనిపోయింది. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ట్యాగ్‌లైన్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. మొదటి పార్ట్‌కు పనిచేసిన చిత్రబృందమే ఈ సీక్వెల్‌లోనూ భాగమవుతున్నారు. తరుణ్‌భాస్కర్ దాస్యం దర్శకత్వంలో డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించనున్నారు. విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రలు పోషించనున్నారు.

యువతను ఆకట్టుకునేలా...



నూతన నటుడు సాయికృష్ణ హీరోగా వెంకటరమణ పసుపులేటి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలె ప్రారంభించిన ఈ సినిమాకు 'పవర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "యువతను ఆకట్టుకునే కథాంశంతో పాటు అద్భుతమైన సాంకేతిక విలువలతో చిత్రం ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తుంది" అని అన్నారు. ఆ చిత్రానికి ఎడిటర్: నందమూరి హరి, సినిమాటోగ్రఫీ: బి.ఎస్.కుమార్, సంగీతం: శంకర్ మహదేవన్.

షఫాలీ మృతికి కారణమిదేనా?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించారని మొదట వార్తలు వచ్చాయి. ఆమె కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి గల పూర్తి కారణాలను ఇంకా వెల్లడించలేదు. మరోవైపు అందంపై ఉన్న మమకారమే ఆమె ప్రాణాలు కోల్పోయేలా చేసిందని నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఆమె కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్సను తీసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం ఇంట్లో పూజ ఉండడంతో ఆమె ఆ రోజంతా ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతో యాంటీ ఏజింగ్ ఔషధాలు, ఇంజెక్షన్లు తీసుకోవడంతో అవి వికటించి గుండెపోటుకు దారి తీసుంటాయని వార్తలు వస్తున్నాయి.

యానాంలో... యానిమల్స్ షో



విన్యాసాలతో ఆకట్టుకున్న మేలు జాతికుక్కలు

యానాం, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రంలో పాడిపశువుల రైతులను, పెంపుడు జంతువును పోషించే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా మూగజీవాలతో వాటి యాజమానులకు పోటీలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా యానాం పశుగణాభివృద్ధి, పశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పశువులు, కోళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. పశువైద్యాధికారి డాక్టర్ కె.ఎ. కుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాంలోని ఇళ్లల్లో పెంచుకునే వివిధ జాతుల కుక్కలు, పిల్లులు, పాడిగేదేలు, పుంగనూరు, దేశవాళీమేరు జాతి ఆవులను ప్రదర్శనలో ఉంచారు. ప్రముఖ చమురు సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీలో ఉండే మేలు జాతి కుక్కలతో వాటి సంరక్షులు చేయించిన విన్యాసాలు ఎంతో ఆకర్షించాయి. ప్రదర్శనలో ప్రతిభ సాధించినవారికి అధికారులు బహుమతులను అందజేశారు.



ప్రదర్శనలో పిల్లులు, కుక్కలు, ఆవులు

అంతర్వేదిలో ఎన్నికల కమిషనర్ పూజలు



ఎన్నికల కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్, ఐఏఎస్ నీలం సాహ్నీ కుటుంబ సమేతంగా ఆదివారం విచ్చేశారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటాన్ని ఏసీ సత్యనారాయణ అందించారు.

2న ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జులై 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నామని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు వెల్లడించారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి కాకినాడలోని జడ్పీ సమావేశ హాల్‌లో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని సీఈవో ఓ ప్రకటనలో కోరారు.

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో త్వరలో ఏఐ కోర్సులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): ఐటీఐ స్థాయి నుంచే ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను పాఠ్యాంశంగా రూపొందించాల్సిన అవసరాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార టెక్నాలజీ శాఖ (న్యూఢిల్లీ) గుర్తించింది. ప్రభుత్వ ఐటీఐల్లో ఏఐ షార్ట్ టర్మ్ కోర్సులు ప్రవేశపెట్టేందుకు కేంద్రప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొమ్మిది ప్రభుత్వ ఐటీఐలను ఎంపిక చేయగా అందులో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఉంది. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఐటీఐలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ కోసం రూ.68 లక్షలు కేటాయించారు. తద్వారా డేటా ఇన్నోవేటర్ అసిస్టెంట్, డేటా క్యూరేటర్ అసిస్టెంట్‌లకు సంబంధించి షార్ట్ టర్మ్ కోర్సులు ప్రారంభిస్తామని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాలవర్మ ఓ ప్రకటనలో తెలిపారు.

రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అంత్యక్రియలు

భారీగా తరలివచ్చిన నాయకులు, అభిమానులు



ఎంపీపీ అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, అభిమానులు



తాటిపాకలో ఎంపీపీ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన కోనసీమ జిల్లా రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. తాటిపాకలో శ్రీను స్వగృహం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచిన భౌతికకాయానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం టీడీపీ కండువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంచి మనసున్న వ్యక్తి శ్రీను అని, సౌమ్యుడిగా పేరు పొంది అతి తక్కువ కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు పొందారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అలాగే ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, తనయుడు గొల్లపల్లి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, పాముల రాజేశ్వరిదేవి, మానేపల్లి అయ్యాజీవేమా పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను భార్య వెంకటలక్ష్మిని పరామర్శించి ఓదార్చారు. ఆయన అంతిమయాత్ర తాటిపాకలో స్వగృహం నుంచి ప్రారంభమై సోంపల్లి కైలాశ భూమి వరకు జరిగింది. అధికసంఖ్యలో కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. దారి పొడవునా శ్రీను భౌతికకాయానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, రాజోలు టీడీపీ పరిశీలకులు చిటికెల రామ్మోహనరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, వైఎస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం

రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అకాల మృతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. రాజోలు నియోజకవర్గంలో శ్రీను క్రియాశీలకంగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, శ్రీను కుటుంబ సభ్యులకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అకాల మృతి బాధాకరమని మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. శ్రీను మరణం టీడీపీకి తీరనిలోటని, కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కృత్రిమ మేధతో మార్పులు

- ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ
- 'జీజీయూ'లో ముగిసిన వికసిత్ భారత్-2047 జాతీయ సదస్సు



ముగింపు సదస్సులో మాట్లాడుతున్న సమీర్ శర్మ

రాజానగరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ కారణంగా పలు మార్పులు జరుగుతున్నాయని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ప్రాంగణంలో వికసిత్ భారత్-2047 కోసం పరిశోధనలు, నవీకరణలు అంశంపై 2రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్య నారాయణరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో సమీర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు సృజ నాత్మకతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సృజనాత్మకత అంటే సమస్యల పరిష్కారం అంటూ స్పష్టత కల్పించారు. విజ్ఞాన భారతి జాతీయ సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్ రామదాస్ మాట్లాడుతూ జీజీయూలో ఇటువంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరిశోధన, సృజనాత్మక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు, ప్రో చాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి 58మంది మేధావులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు సమకాలీన అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. పర్యావరణ మార్పులపై ముంబై ఐఐటీ ప్రొఫెసర్ చేతన్ సోలంకి ఆన్‌లైన్‌లో కీలకోపన్యాసం ఇచ్చారు. భూమి వనరులు పరిమితమని, వాటిని బాధ్యతాయుతంగా వినియోగించడం మనందరి కర్తవ్యమన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత రసాయన ఇంజనీర్ ఆచార్య జీడీ యాదవ్ గ్రీన్ హైడ్రోజన్‌పై అవగాహన కల్పించారు. ఊహించిన 1.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల ఇప్పటికే చేరుకుందని, ఇది కొనసాగితే పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. టై గ్లోబల్ చైర్మన్ మురళీ బుక్కపట్నం ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. జీజీయూ, టై గ్లోబల్, వాద్వానీ ఫౌండేషన్, గ్రీన్ టెర్రి ఫౌండేషన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. సలహాదారు, కన్వీనర్ సిసిర్ సాహూ, కోకన్వీనర్ టీవీ.ప్రసాద్, ఉపకులపతి యు.చంద్రశేఖర్, ప్రోచాన్సలర్ కేవీరాజు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీలో ఉమ్మడి జిల్లా జట్ల ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

పిఠాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లు ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచాయి. కర్నూలులో ఈనెల 28, 29 తేదీల్లో ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాల, బాలికల విభాగాల్లో ఉమ్మడి జిల్లా జట్లు మూడోస్థానంలో నిలిచాయి. ఈ జట్లకు మేనేజర్లుగా పీడీ శేషకుమారి, కె.నాగలింగేశ్వరరావు, వంశీ, కోచ్‌గా పి.లక్ష్మణరావు వ్యవహరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు, కోచ్, మేనేజర్లను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు తదితరులు అభినందించారు.

ఒంటరిగా ఉన్న వృద్ధులే టార్గెట్!

- మాయమాటలు చెప్పి ఇళ్లల్లోకి ప్రవేశించి డబ్బు, బంగారం, వెండి చోరీలు
- ముగ్గురు మైనర్లను అరెస్టు చేసిన అమలాపురం పోలీసులు
- 21.50 గ్రాముల బంగారం, 110 గ్రాముల వెండి, మోటారు సైకిళ్ల స్వాధీనం

అమలాపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను అమలాపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామానికి చెందిన 15 నుంచి 16 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలురు వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న వృద్ధులకు మాయమాటలు చెప్పి వారి ఆధార్ కార్డు, రూ.500 నగదు తీసుకుని వస్తే దగ్గరలో ఉన్న సెంటర్‌లో, సచివాలయాల్లో గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని నమ్మించేవారు. వారు అలా వెళ్లగానే ఇళ్లల్లోకి ప్రవేశించి డబ్బు, బంగారం, వెండి ఆభరణాలను దొంగతనం చేశారు. అమలాపురం నల్లవంతెన, విత్తనాలవారి కాల్వగట్టు, పేరూరు ప్రాంతాలతో పాటు ముమ్మిడివరం, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో నగదు, నగలుతో పాటు మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ఆత్రేయపురం, కడియం పరిసర ప్రాంతాల్లో ఇదే తరహా దొంగతనాలు చేశారు. వరుస చోరీలకు పాల్పడుతున్న బాలురను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.40వేలు నగదు, 21.50 గ్రాముల బంగారు ఆభరణాలు, 110 గ్రాముల వెండి, 2 స్ప్లెండర్ మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని రాజమహేంద్రవరం మూడోవ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, జువైనల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.నిందితులు ముగ్గురుమైనర్లను రాజమహేంద్రవరం జువైనల్ హోంకు తరలించినట్టు సీఐ వీరబాబు తెలిపారు.

జిన్నగట్టులో రెండు తాటాకిళ్లు దగ్ధం

రూ.4లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా

ఎటపాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు దగ్ధమైన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీలోని జిన్నగట్టు గిరిజన గ్రామంలో జరిగింది. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తొలుత చిచ్చడి జనార్ధన్ తాటాకు ఇంటికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు అప్రమత్తమయ్యేలోపు ఆ మంటలు పక్కనే ఉన్న తమ్ముడు చిచ్చడి మహేష్ ఇంటికి కూడా వ్యాపించాయి. దాంతో రెండు తాటాకిళ్లు క్షణాల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. జనార్ధన్ ఇంటి బీరువాలోని 4 జతల వెండి పట్టీలు, రూ.12వేలు నగదు, కుట్టుమిషన్, గృహోపకరణాలు.. మహేష్ ఇంటి బీరువాలోని వెండి పట్టీలు, రూ.5 వేల నగదు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రూ.4లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్టు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

అన్నవరంలో..

70 వేల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు



జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కొనుగోలుకు వేచి ఉన్న భక్తులు

అన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం తొలి ఆదివారం సత్యదేవుడి ప్రసాదం విక్రయాల్లో భాగంగా సుమారు 70 వేల ప్యాకెట్లను విక్రయించినట్టు ప్రసాదం విభాగ అధికారులు తెలిపారు. తలుపులమ్మ లోవ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో భక్తులు అన్నవరంలో ఆగి స్వామిని దర్శించి ప్రసాదాలు కొనుగోలు చేస్తుంటారు. దీనికణుగుణంగా తొలి పావంచా వద్ద జాతీయ రహదారిపై ఉన్న రెండు నమూనాలయల వద్ద అదనపు కౌంటర్లను ఏర్పాటుచేయడంతో పాటు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తూ ఈవో సుబ్బారావు ఆదేశాలిచ్చారు. లోవ భక్తులు 45వేల ప్యాకెట్లు, కొండపై సత్యదేవుడిని దర్శించిన భక్తులు మరో 25వేలు ప్యాకెట్లు కొనుగోలు చేశారని తెలిపారు.

రూ.లక్ష విరాళం


అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన గుబ్బల హరిప్రియ రూ.లక్ష విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఈవో అభినందించి వారికి ప్రత్యేక దర్శనం, స్వామివా రి ప్రసాదం అందజేశారు.



విరాళం అంద జేస్తున్న దాత

'లోవ'లో వైభవంగా ఆషాఢ మహోత్సవాలు

తుని రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ దేవస్థానంలో ఆషాఢ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలి ఆదివారం అమ్మవారు మట్టిగాజుల అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి సుమారు 40వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వసతిగదులు, వంటషెడ్‌ల్లో వంటావార్పు చేసుకుని కుటుంబసమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.10 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో పి.విశ్వనాధరాజు తెలిపారు.



తలుపులమ్మకు మట్టిగాజులతో అలంకరణ

నటి శ్రీదేవి సందడి

లోవ దేవస్థానంలో కోర్టు సినిమా నటి శ్రీదేవి సందడి చేశారు. కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా ఈవో అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు.



నటి శ్రీదేవికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కారు బోల్తా : ముగ్గురికి తీవ్రగాయాలు

గొల్లప్రోలు రూరల్, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌లో ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కత్తిపూడి నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు బైపాస్ కూడలి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. కారు నడుపుతున్న పెన్నాడ మణికంఠతో పాటు అరిపిరి శివ, ఇరికం స్వామికు తీవ్ర గాయాలయ్యాయి. మణికంఠను కాకినాడ, మిగిలినవారిని పిఠాపురంలో ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గొల్లప్రోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చేబ్రోలులో బోల్తా పడిన కారు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

చిత్రహింసలు భరించలేకపోతున్నా...

స్వదేశానికి రప్పించండి

ఖత్తర్‌లో కోనసీమ జిల్లా మహిళ ఆవేదన

కొత్తపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఖత్తర్‌లో పనికి కుదిరిన వారు పెట్టే చిత్రహింసలు భరించలేకపోతున్నానని తనను స్వదేశానికి తిరిగి రప్పించాలని వేడుకుంటుంది ఓ మహిళ. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల శివారు పూజారిపాలానికి చెందిన పమ్మి లలిత తన ఇద్దరు పిల్లల కోసం ఉపాధి నిమిత్తం 5 నెలల క్రితం ఖత్తర్ వెళ్లింది. అక్కడ భాష రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని పేర్కొంది. పనిచేసే చోట చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భాష రాకపోవడంతో చిత్రహింసలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మంత్రి లోకేశ్ తన స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటుంది. తనతో పాటు ఇంకో మహిళ పనిచేసేదని, 2 నెలలకే చిత్రహింసలు భరించలేక వెళ్లిపోయిందని, తనను కూడా స్వదేశానికిరప్పించాలని ప్రాధేయపడింది.



వీడియోలో మాట్లాడుతున్న లలిత

కరప బాలిక ఆచూకీ లభ్యం

డిప్యూటీ సీఎం చొరవతో వేగంగా కదిలిన పోలీసులు

తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు

కరప, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి పుట్టినరోజని చెప్పి ఇంట్లోంచి వెళ్లిపోయి అదృశ్యమైన మైనర్ బాలిక ఆచూకీ లభ్యంకాగా సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. మాయమాటలతో ఆమెను తీసుకెళ్లిన యువకుడిని అదుపులోకి తీసుకుని అతడిపై కిడ్నాప్, రేప్, పోక్సో కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన ఓ కుటుంబంతో సహా కాకినాడ జిల్లా కరప వచ్చి గత కొన్నేళ్లుగా జిలేబీ, సమోసాల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పెద్ద కుమార్తె స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 8న స్నేహితురాలి పుట్టినరోజని చెప్పి ఇంట్లోంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా బాలిక అదృశ్యంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. తమ ఇంటిపక్కనే ఉంటున్న బుద్దాల మణికంఠ అనే యువకుడు తమ కుమార్తెను కిడ్నాప్ చేశాడంటూ తల్లిదండ్రులు ఇటీవల జిల్లా ఎస్పీ కార్యాలయంలో, జిల్లా పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. పవన్ ఆదేశాలతో జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలతో గాలించగా హిందూపూర్ సమీపంలో వారున్నట్టు గుర్తించి శనివారం రాత్రి అక్కడ నుంచి తీసుకొచ్చారు. బాలికకు ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం ఆమె తల్లిదండ్రులతో కలిసి కరప పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పలు రకాల సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కాట్రేనికోన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గచ్చకాయలపొర గ్రామానికి చెందిన మత్స్యకారుడు ముదే సుబ్బారావు(48) చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఆదివారం అర్ధరాత్రి చేపలవేటకు వెళ్లిన సుబ్బారావు సోమవారం ఉదయానికి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు పర్రలో గాలించగా అతడు శవమై కన్పించాడు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు.



పర్రలో సుబ్బారావు మృతదేహం

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

చింతూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదా ఘాతంతో యువకుడు మృతి చెందిన అల్లూరి జిల్లా చింతూరు మండలం వంకగూడెంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ పి.రమేష్ కథనం మేరకు వంకగూడెనికి చెందిన కృష్ణ (24) స్నానం చేయడానికి వేడి నీటి కోసం హీటర్ వినియోగించాడు. అనంతరం హీటర్‌ను బక్కెట్‌లో నుంచి బయటకు తీసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కృష్ణ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ఫైల్‌ఫొటో


మృతిచెందిన కృష్ణ

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆర్టీసీ కంట్రోలర్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

సామర్లకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సామర్లకోట కాంప్లెక్స్ కంట్రోలర్‌గా పనిచేసిన చేట్ల వజ్రం ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సేపేని సురేష్-రూప దంపతుల ఆద్వర్యంలో ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. వజ్రం-నాగరత్నం దంపతులకు డ్రైవర్లు, కండక్టర్లు, కాంప్లెక్స్ ఆవరణలోని వ్యాపారులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి: ఎస్టీయూ

కాకినాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బకాయిలు చెల్లించి 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో సంఘ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ, సరెండర్ లీవ్, ఏపీజీ ఎల్ఐ, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తయినందున ఇప్పటికీ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ అభ్యర్థులు వచ్చే వరకు అకడమిక్ ఇనస్ట్రక్టర్లను నియమించి పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 2008, 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీను, శివప్రసాద్, రాంబాబు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరు రాష్ట్రాల్లో రూ.4,460 కోట్ల వ్యాపారం

సిటిజన్ బ్యాంక్ చైర్మన్ రాజు


జ్యోతిప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కాకినాడ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తమ బ్యాంక్ ఆరు రాష్ట్రాల్లో రూ.4,460 కోట్ల వ్యాపారం సాగిస్తోందని సిటిజన్ బ్యాంక్ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం సూర్యకళా మందిరంలో ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ కాకినాడ బ్రాంచి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ రాజు మాట్లాడుతూ 42 శాఖలతో దేశంలో అతిపెద్ద మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీగా నిలిచిందన్నారు. మరో ముఖ్య అతిథి, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కాకినాడ బ్రాంచిలో రూ.175 కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు. సొసైటీ డైరెక్టర్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ సిటిజన్ బ్యాంక్‌ను రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ సొసైటీగా ప్రకటించిందన్నారు. సమావేశంలో చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సూర్యారావు, స్వప్న సౌధ చంద్రశేఖర్, కాకినాడ బ్రాంచి మేనేజరు ఎస్ఎస్ నాయుడు, రాజమండ్రి బ్రాంచి మేనేజరు రాజు, గోపాలకృష్ణ, రమణమూర్తి, ఫణీంద్ర, వర్మ, కౌశిక్, బ్యాంకు సిబ్బంది, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలన అనంతరం సిటిజన్ బ్యాంకు వ్యవస్థాపకుడు హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఎమ్మెల్సీ రాజశేఖరం దంపతులను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ రాజశేఖరానికి పౌర సన్మానం

కాకినాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరానికి ఆదిత్య విద్యా సంస్థలు, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కాకినాడ శ్రీనగర్‌లోని ఆదిత్య ప్రాంగణంలో పౌర సన్మానం నిర్వహించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ అధ్యక్షతన జరిగిన సభకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి, ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ సుగుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖరం మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖాధికారులు, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి'

కాకినాడ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. ఆదివారం కచేరీపేటలోని యూటీఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నంనాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'విజన్-2047 ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి' అంశంపై సదస్సు నిర్వహించారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో గంగారావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన విజన్-2047 డాక్యుమెంట్ కార్పొరేట్ల ప్రయోజనం కోసం తయారు చేసిందన్నారు. ఇది కేంద్రంలోని బీజేపీ విధానాలకు అనుకూలంగా ఉందన్నారు. ఇందులో వ్యవసాయంలో కార్పొరేట్ పద్ధతి ప్రవేశపెట్టాలని పొందుపరిచారని, దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేట్ తరహా అభివృద్ధి అంటే సంపద ఒకేచోట పోగుపడుతుందన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తాయన్నారు. రిటైర్డ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.మహిపాల్ మాట్లాడుతూ ఏదైనా విజన్ డాక్యుమెంట్ విడుదల చేసే ముందు క్షేత్రస్థాయిలో అధ్యయనం జరగాలన్నారు. ప్రజారోగ్యం గురించి ఈ డాక్యుమెంట్‌లో ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. సదస్సులో అంబేద్కర్ ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వీవీ రమణ, ఆర్వీఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజు, సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పరుపులు పంపిణీ


విద్యార్థులకు పరుపులు అందజేస్తున్న రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ సభ్యులు

కాకినాడ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం విద్యార్థులకు రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ రూ.లక్ష విలువైన 60 పరుపులు సమకూర్చింది. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సీపోర్ట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం వీటిని అందజేశారు. క్లబ్ సభ్యుడు వి.శ్రీనివాస్ రూ.5వేలు విలువ చేసే పుస్తకాలు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ప్రసాదబాబు, శేషుకుమార్, వర్మ, రోటరీ క్లబ్ కాకినాడ సన్ రైజ్ అధ్యక్షుడు కృష్ణవర్మ, క్లబ్ కౌన్సిలర్ ఏవీ రంగారావు, సభ్యులు సాయిసుందర్, ఆషా, విజయలక్ష్మి, రుత్విక్ బాలాజీ, హరిప్రసాద్, నందకిషోరుడు, నగధర్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ బిజినెస్ నెట్వర్క్ మూడో వార్షికోత్సవం

కాకినాడ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యువ వ్యాపారవేత్తల నేతృత్వంలోని లోకల్ బిజినెస్ నెట్వర్క్ మూడో వార్షికోత్సవాన్ని సరోవర్ పోర్టికోలో ఆ సంస్థ అధ్యక్షుడు రవితేజ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యాన వచ్చే నెల 13న కాకినాడ టౌన్ హాలులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం పోస్టర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు ఆవిష్కరించారు. కార్యదర్శి ఏవీవీ సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సిరాజ్, డైరెక్టర్ అంకూర్ సురానా, సభ్యులు పాల్గొన్నారు.


సారె ఎత్తుతున్న పాదగయ ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ దంపతులు


అమ్మవార్లకు సమర్పించేందుకు సారె తీసుకుని విరవ నుంచి పాదయాత్రగా బయల్దేరిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం సభ్యులు, మహిళలు

రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు ఆషాఢ సారె

విరవ నుంచి పిఠాపురం పాదయాత్రగా తరలివచ్చి సమర్పించిన మహిళలు



పిఠాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్ర పరిసరాలు అమ్మవార్ల నామస్మరణతో మార్మోగాయి. ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసియున్న రాజరాజేశ్వరీదేవి, దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత పురుహూతికా అమ్మవార్లకు ఆషాఢ మాస సారె సమర్పణకు మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చారు. విరవకు చెందిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం సభ్యులు, మహిళలు పది కిలోమీటర్లు పాదయాత్రగా సారె తీసుకొచ్చారు. విరవ వినాయక ఆలయం వద్ద మహిళలకు పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్ దంపతులు సారె ఎత్తారు. విరవ, ఎఫ్‌కేపాలెం, కందరాడ, కుమారపురం గ్రామాల మీదుగా పిఠాపురం పాదగయ క్షేత్రానికి చేరుకున్నారు. దారిపొడవునా మహిళలు తెస్తున్న సారెకు గ్రామాల్లో ప్రజల్లో నమస్కరించారు. గ్రామాలన్నీ భక్తితన్మయత్వంలో ఓలలాడాయి. వారంతా తాము వండి తీసుకొచ్చిన పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, ఇతర పదార్థాలను అమ్మవార్లకు సమర్పించి పూజలు చేశారు. ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలులో విద్యార్థుల అ'పూర్వ' కలయిక


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న 2012 బ్యాచ్ ఐదో తరగతి విద్యార్థులు

గొల్లప్రోలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని కరణం గారి తోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2012 బ్యాచ్ ఐదో తరగతి విద్యార్థులు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. జ్ఞాపకాల సందడితో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా క్షేమ సమాచారాలు తెలుసుకోవడంతో పాటు చిన్నారులుగా మారి తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పట్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన బావిశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు వి.సూర్యం, ఎంవీ ప్రసాద్‌లను సత్కరించారు. అనంతరం తమ కలయికకు గుర్తుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థుల కలయికలో చక్కపల్లి శివ, గాజుల గంగ, మండపాక సాయి, కోసూరి ధనలక్ష్మి కీలకపాత్ర పోషించారు.

అధ్యాపకుడికి ఉద్యోగ విరమణ సన్మానం

పిఠాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు (పీజీటీ) కసా వెంకట రమణమూర్తి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన్ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, సహచర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


గురు పూజోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ గోదావరి విభాగ్ కన్వీనర్ శంకర్

'జీవన గమనంలో గురువు పాత్ర కీలకం'

పిఠాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి జీవన గమనంలో గురువు పాత్ర కీలకమని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి విభాగ్ కన్వీనర్ బండ్ల శంకర్ తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో ఆదివారం గురు పూజోత్సవం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కార్యవాహ పెమ్మరాజు సత్యరామచంద్రరావు, ప్రముఖ వ్యాపారవేత్త బాదం సూర్యప్రకాష్, గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, మురళి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్, నారాయణరెడ్డి, తోట ఏడుకొండలు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఉప్పాడ బీచ్ రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్

కొత్తపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఉప్పాడ బీచ్ రోడ్డులో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.వెంకటేష్ తన సిబ్బందితో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. వివిధ వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్




మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే చినరాజప్ప, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే వర్మ

2 నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'

సామర్లకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన టీడీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం మంత్రి నారా లోకేశ్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విజయాలు, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు జూలై 2 నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' నిర్వహణకు రూపొందించిన ప్రణాళిక విజయాలను అందిస్తుందని చినరాజప్ప ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల అరాచకాలను కూడా వివరించేందుకు ఇది మంచి అవకాశమన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లకు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. సుపరిపాలనలో తొలి అడుగు చేపట్టే విధానం గురించి వారికి తెలియజేశారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని చంద్రబాబు వర్మకు సూచించారు.

'కంప్యూటర్ లాంగ్వేజెస్‌పై అవగాహన పెంచుకోవాలి'


కైట్ పూర్వ విద్యార్థి శ్రీధర్‌తో అధ్యాపకులు

కాకినాడ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే ఏ విధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి, ఇంటర్వ్యూలను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల విశ్వం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఏపీ సాఫ్ట్‌వేర్ కంపెనీల సంఘ రాష్ట్ర కార్యదర్శి, వెంచర్ ఆఫ్‌షోర్ ఇన్ఫర్మేటిక్స్ (అమెరికన్ కంపెనీ) ఉపాధ్యక్షుడు, కైట్ ఇంజనీరింగ్ కళాశాల 2006 బ్యాచ్ విద్యార్థి సరగం శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ లాంగ్వేజెస్, ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, గోపి, శ్రీనివాస్, సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



పిఠాపురం ఫైర్ స్టేషన్ సమీపంలో ధర్నా చేస్తున్న ప్రజలు

సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ ఆందోళన

పిఠాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీప ప్రాంత ప్రజలు ఆదివారం ధర్నా నిర్వహించారు. గృహాలు, పాఠశాలల మధ్య సెల్ టవర్ ఏర్పాటుకు తాము అభ్యంతరం తెలిపినా పట్టించుకోకుండా రాత్రివేళ పనులు సాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్ టవర్ రేడియేషన్ వలన ప్రజలు, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. టవర్ నిర్మాణం నిలిపివేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. పనులు నిలిపివేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో వెలంపేట మహిళలు, ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ జాతరకు ఆషాఢ మాస తొలి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. సుమారు 10వేల మంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

క్రికెట్ సంఘ మాజీ కార్యదర్శి కిరణ్‌రాజుకు గౌరవ డాక్టరేట్



కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన క్రికెట్ సంఘ మాజీ కార్యదర్శి, సంఘ సేవకుడు కటారి శ్రీనివాస్ కిరణ్‌రాజుకు తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎనిమిది సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలను గుర్తించి సోషల్ సర్వీసెస్ కేటగిరీలో ఈ నెల 28న జరిగిన యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న రాజును పలువురు అభినందించారు

సతీష్‌స్వామికి 'ఇండియన్ అచీవర్' అవార్డు



పిఠాపురం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అందరి బంధువులం-అయ్యప్ప సేవ కులం సభ్యుడు, పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన రాసంశెట్టి సతీష్‌స్వామికి ఇండియన్ అచీవర్ అవార్డు లభించింది. తమిళనాడులోని హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సతీష్‌ను అబాస్ సోషల్ మీడియా ఇన్ఫ్లూయన్సర్‌గా గుర్తించి ఈ అవార్డు ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, సంస్థ ప్రతినిధుల ద్వారా ఈ అవార్డు అందుకున్నారు. సతీష్‌స్వామిని అబాస్ సభ్యులు డాక్టర్ కందా వెంకట్రాజు గురుస్వామి, సోము శివప్రసాద్ తదితరులు అభినందించారు.

250 మందికి కంటి పరీక్షలు

సామర్లకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో జైన్ ఆచార్య శాంతి గురుదేవ్ ఆశీస్సులతో భవర్‌లాల్ డి.జైన్ కుటుంబసభ్యుల సౌజన్యంతో కిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అవని, డాక్టర్ షేక్ రహీమున్నీసా 250 మంది పేదలను పరీక్షించి వారిలో 65 మందిని శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక వాహనాల్లో కాకినాడ తరలించారు. శిబిరంలో సుమిత్‌జైన్, అమిత్‌జైన్ సోదరులతో పాటు మేనేజరు సత్యనారాయణ, వాసవి వనితా క్లబ్ ప్రతినిధి ఊరా నాగమణి, సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి కర్రి ఆదినారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడిరత్నం సేవలందించారు.


గుంతలను పూడ్చిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో గుంతలు పూడ్చివేత

సామర్లకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మాదవపట్నం కూడలి రోడ్డులో ఇరువైపులా మార్జిన్లు పెద్ద పెద్ద గుంతలుగా మారి వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. స్పందించిన సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తన సిబ్బందితో కలిసి ఆదివారం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సుమారు 200 మీటర్ల పొడవున రోడ్డు మార్జిన్లలో నాలుగు లారీల గ్రావెల్, క్వారీ డస్ట్ వేసి గుంతలు పూడ్చారు. గరగారావును పలువురు వాహనచోదకులు అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

జగ్గంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఎస్ఐ రఘునాధరావు తన సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే కోర్టుద్వారా ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు. ఫైన్ కట్టలేని వారికి జైలుశిక్ష విధిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే ఇద్దరు వ్యక్తులు హెల్మెట్‌లు ధరించాలన్నారు. ద్విచక్రవాహనానికి నెంబర్ బోర్డు, రికార్డు, డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెంలో తాగునీటి కష్టాలు

● గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా
● మంచినీటి కోసం మహిళల ఇబ్బందులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు



నీటి కోసం ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

మోతుగూడెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైనా ఏజెన్సీలో గిరిజన ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. చింతూరు మండలం మోతుగూడెం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న 50 మంది గిరిజన ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ మంచినీళ్లు కావాలంటే దూరంగా ఉన్న పోలీస్‌స్టేషన్ చెక్ పోస్టువద్ద ఉన్న పబ్లిక్ కుళాయివద్దకు వెళ్లి మంచినీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజన మహిళలు తాగునీటి కోసం ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోతుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న సోయం రమేష్ ఇంటివద్ద గతంలో బోరు వేయించి మోటార్ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆ మోటార్ బోరు నాలుగు నెలల కిందట మరమ్మతు వచ్చి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేయించకపోవడంతో నీటికోసం గిరిజన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి ఇక్కడి ప్రజలంతా వేరేచోటుకు వెళ్లి నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదని మోతుగూడెం గిరిజన మహిళలు వాపోతున్నారు. దీంతో మహిళలు ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన తెలిపారు. ఇప్పటికైనా మోతుగూడెంలో మంచినీటి సమస్యను ఐటీడీఏ పీవో చొరతీసుకుని మాకు మంచినీళ్లు అందజేయాలని కోరారు.

● ఈ విషయమై మోతుగూడెం మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మోహన్ వివరణకోరగా బోరు మోటార్ మరమ్మతులకు గురవ్వడం వాస్తవం. కానీ పిల్లలు ఆడుకుని మోటార్‌లోకి చిన్నచిన్న రాళ్లు వేయడంతో మోటారులో కూరుకుపోయాయన్నారు. మోటార్‌ను పైకి తీయాలంటే రావడం లేదని తెలిపారు. మరోసారి మోటార్ తీసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. సాధ్యం కాకపోతే సర్పంచ్‌తో మాట్లాడి కొత్త బోరువేస్తామని తెలిపారు.

పాపికొండలకు మూడు బోట్లు

దేవీపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండలకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మంటూరు, తెలిపేరు, నడిపూడి, కొండమొదలు తదితర గ్రామాలమీదుగా ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు పర్యాటకులు విచ్చేశారు. ముందుగా పోశమ్మ గండి అమ్మవారిని దర్శించుకుని అక్కడి బోటు పాయింట్ నుంచి మూడు బోట్లలో 131 మంది పర్యాటకులు తరలివెళ్లారు. పేరంటాలపల్లిలో సందడి చేసి సాయంత్రం తిరిగి వచ్చారు.

అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ అధికారులు భక్తులు అన్ని సదుపాయాలు కల్పించారు. సుమారు పదివేల మంది అమ్మవారిని దర్శించుకుంటున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న గోదావరి



పోశమ్మగండి వద్ద పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంతాలైన కొండమొదలు, నడిపూడి, తెలిపేరు, కచ్చులూరు, గండూరు, సుద్దకొండ, మంటూరు, మడిపల్లి తదితర గ్రామాలను ఆనుకుని గోదావరి వరద నెమ్మది నెమ్మదిగా పెరుగుతోంది. దండంగి, పూడిపల్లి, ఎ.వీరవరం ముంపు గ్రామాల పొలాల్లో వరద నీరు చేరింది. సీతపల్లి వాగు వద్ద ఉన్న బ్రిడ్జి వరద నీరు చేరడంతో గత నెలలో గండిపై ఉన్న నాలుగు పంచాయతీల ప్రజలు ఇందుకూరుపేట ప్రభుత్వ కార్యాలయానికి వచ్చేందుకు రంపచోడవరం, గోకవరంమీదుగా అదనంగా 40కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. గత ఐదు రోజుల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీనం స్తంభించింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

'అసాంఘిక చర్యలపై సమాచారం ఇవ్వండి'

ఎటపాక, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అప్పలరాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడిపందాలు, పేకాట, ఇతరత్రా అసాంఘిక చర్యలు నిర్వహిస్తే ఉపేక్షించమని ఆయన హెచ్చరించారు. జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల వెంబడి మద్యం సేవిస్తూ, ప్రయాణికులకు, ఇతరులకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గ్రామస్థాయిలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

రాజవొమ్మంగి జూన్ 29(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పనిగంటలు తగ్గించాలని తదితర డిమాండ్లతో జూలై 9న కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రంపచోడవరంజిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆదివారం పిలుపునిచ్చారు. ఆదివారం రాజవొమ్మంగిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూజిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కార్మికచట్టాలను మోదీమతోన్మాద ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు లేబర్‌కోడ్లు తెచ్చిందని విమర్శించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఖరీఫ్ వచ్చింది.. వలస కూలీలు వచ్చేశారు..

● రూ.4వేలకే నారుతీసి నాట్లు వేస్తున్నారు
● 2వేల మందికిపైగా వచ్చిన వెస్ట్ బెంగాల్ కూలీలు



మురారిలో నాట్లు వేస్తున్న వెస్ట్ బెంగాల్ కూలీలు

గండేపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఖరీఫ్, రబీ వచ్చిందంటే గత ఐదారు సంవత్సరాల నుంచి వెస్ట్ బెంగాల్ కూలీలు మన ప్రాంతాలకు వచ్చి ఉపాధి పొందుతుంటారు. ఖరీఫ్, రబీ రెండునెలలు మన ప్రాంతంలోనే కూలీలు ఉంటూ నాట్లు వేసుకుని ఉపాధి పొంది ఆ సొమ్ములతో వారి ప్రాంతాల్లో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ఆరంభంకాగానే వెస్ట్‌బెంగాల్ కూలీలు వలస వచ్చారు. ముందుగా బోరు, చెరువు నీరు ఆధారిత ప్రాంతాల్లో నాట్లు వేస్తూ ఖరీఫ్ పంట సాగు ప్రారంభించారు. వెస్ట్ బెంగాల్ కూలీలు ఈఖరీఫ్ సీజన్ చేసుకోవడానికి ఈ ప్రాంతానికి వచ్చారు. ఇప్పటికే ఖరీఫ్ నాట్లు వేయడం ప్రారంభించారు. ఎకరానికి రూ.4వేలు ఇస్తే నారు పీకి నాట్లు వేసి వెళ్లిపోవడంతో రైతులకు పొలంలో దిగే పని లేకుండా పని చకచకా చక్కపెట్టేస్తున్నారు. దీంతో ఐదారు నెలల నుంచి మన ప్రాంత రైతులంతా కూడా ఆ కూలీలకు ఇచ్చేస్తున్నారు. అలాగే మన ప్రాంత కూలీలకు వాళ్లకి రూ.2వేలు వ్యవసాయ పెట్టుబడి కలిసివస్తుందని పలువురు చెబుతున్నారు. వెస్ట్ బెంగాల్ కూలీలు వేసే నాట్లువల్ల దిగుబడులు కూలీ బాగా కలిసి వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అలాగే జిల్లాలో సుమారు ఇప్పటికే 2వేల మందికిపైగా దిగారు. కూలీల రాకతో మన ప్రాంత కూలీలకు ఉపాధి తగ్గిందని పలువురు చెబుతున్నారు. వీరికి భాష రాకపోవడంతో మధ్యవర్తులు ప్రవేశించి వారి వద్ద కమిషన్లు తీసుకుంటున్నారు. మండలంలో సుమారు ఏడువేల ఎకరాల్లో ఖరీఫ్ నాట్లు వేయాల్సి ఉండగా 50ఎకరాల వరకు నాట్లు వేయడం పూర్తయిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మా ప్రాంతంలో ఉపాధిలేక ఖరీఫ్, రబీ సీజన్‌లో ఇక్కడికి వచ్చి పనులు చేసుకుంటున్నామని ఈ ప్రాంతవాసులు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని వెస్ట్ బెంగాల్ కూలీలు చెబుతున్నారు.

మంత్రి లోకేష్ దృష్టికి తుని సమస్యలు



మంత్రి లోకేష్‌కు తుని సమస్యలు విన్న విస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తుని ఎమ్మెల్యే యనమల దివ్య తీసుకెళ్లారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెలుగుదేశం విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి, టీడీపీ యువనేత నారా లోకేష్‌ను తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కు అభివాదం చేసిన ఎమ్మెల్యే కొద్దిసేపు నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల అవసరాలకు సంబంధించిన అంశాలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు.

వెంకటరమణకు ఆర్థిక సాయం అందజేత



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గండేపల్లి గ్రామానికి చెందిన హెర్నియాతో బాధపడుతున్న కటకం వెంకటరమణకు టీడీపీ సోషల్ మీడియా సైనికుడు పసుమర్తి సుబ్రహ్మణ్యం స్పందించి సోషల్ మీడియాతో పోస్టు పెట్టడంతో పోస్టును చూసిస్పందించి దాతల సహాయంతో రూ.2లక్షల సమకూర్చడంతో గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాధితుడు వెంకటరమణకు రూ.2లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో బొల్లం రెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశి, రెడ్డి సుబ్బారావు, చుండ్రు బ్రహ్మారాజు, సుంకవల్లి రమేష్, ఇప్పర్ల సురేష్, దారా కాటయ్య పాల్గొన్నారు.

గోతిలోపడి యువకుడి మృతి

జగ్గంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ కాలుజారి గోతిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని జె.కొత్తూరులో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆదివారం జరిగింది. బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన కేతా సత్యనారాయణ (23)పొలంలో దొండపాదులు వేశాడు. వాటికి పందిరి వేయడానికి కర్రలు తీసుకురావడానికి కేతా పండు అనే స్నేహితుడితో కలిసి వెళ్లాడు. ట్రాక్టర్‌పై కర్రలను తీసుకుని వస్తుండగా సత్యనారాయణ మూత్రవిసర్జనకు వెళ్లాడు. అక్కడ కాలు జారి లోతైన గోతిలో పడిపోయాడు. డ్రైవర్ అతడిని పైకి తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించగాఅప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జగ్గంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామశివారులో ఎస్ఐ రఘునందన్, సిబ్బంది పేకాట రాయుళ్లపై దాడిచేసి 5 మందిని పేకాట రాయుళ్లను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.5100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎవరైనా జూదక్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ



అమరావతిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనితలను ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంవద్ద నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశం లో భాగంగా మంత్రులను సత్యప్రభ కలిసి నియోజకవర్గంలోని సంక్షేమ కార్యక్రమాలు అమలుతీరును చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా జూలై 2 నుంచి సుపరిపాలన తొలి అడుగు పేరిట నిర్వహించనున్న ఇంటింటి ప్రచారం పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ వంటి తదితర అంశాలతో మంత్రులతో సమాలోచనలు జరిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు తిప్పికొట్టాలని మంత్రులు లోకేష్, అనితలు వివరించారు.



సత్యదేవుడి తొలిపావంచా వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ ప్రతినిధులు

పేదలకు సాయం అందించేందుకు

లోకేష్ ప్రజాశక్తి ఫౌండేషన్ ఏర్పాటు

● సత్యదేవుడి పాదాలచెంత అట్టహాసంగా కార్యక్రమం

అన్నవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు టీడీపీ రాష్ట్ర లోకేష్ ప్రజాశక్తి ఫౌండేషన్ కార్యక్రమాన్ని ఆదివారం ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులతో కలసి సత్యదేవుడి తొలిపావంచా వద్దనుంచి కార్యక్రమం ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చదరం తులసీరామ్ మాట్లాడుతూ దీనిద్వారా ప్రజలకు మంచిచేయడంతోపాటు ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని యువ నాయకుడు రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్రవ్యాప్తంగా ఈ ఫౌండేషన్‌ద్వారా సేవలు విస్తృతం చేస్తామన్నారు. ముందుగా ఫౌండేషన్ ప్రతినిధులు సత్యదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి గ్రామశివారున ఉన్న మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా నుంచి వీరనాగబాబు, రాజేష్, ఎన్.అయ్యప్ప పాల్గొన్నారు. తదుపరి అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాలో పర్యటన ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు పద్మ, అమలగంటి లక్ష్మీతోపాటుగా స్థానిక నాయకులు మెరపల నరసయ్య, కడుపుకుట్ల కృష్ణ, ఐ.వి.రత్నం, రాయవరపు శ్రీను పాల్గొన్నారు.

వాన కురిస్తే ముంపే

● అధ్వానంగా గ్రామీణ రహదారులు
● అడుగుకో మడుగుగా అఘాదాలు
● దారుణంగా గజ్జెనపూడి- ఒమ్మంగి రోడ్ల పరిస్థితి



వర్షపునీటితో జలమయమైన ఒమ్మంగి ప్రధాన రహదారి

ప్రత్తిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. గజ్జెనపూడి-ఒమ్మంగి రహదారులపరిస్థితి మరీ దారుణంగా తయారవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలేశ్వరం-శాంతి ఆశ్రమం ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న గజ్జెనపూడి గ్రామంలో ప్రధాన రహదారి అడుగుకోమడుగుమాదిరిగా అఘాదాలు వంటి గోతులతో శిథిలమైంది. వర్షం కురిసిన సమయంలో ఈ రహదారి చిన్నపాటి చెరువులా మారి స్థానికులు నడవడానికి వీలులేని విధంగా తయారవుతోంది. దీనికితోడు ఈ గ్రామంలో రహదారి వెంబడి డ్రైన్‌ను ఎత్తులో నిర్మించడంవల్ల వర్షం నీరు డ్రైన్లలోకి వెళ్లే మార్గంలేక ప్రధాన రహదారిపైనే నిలిచిపోతుంది. రహదారిని స్వచ్ఛందంగా నిర్మించేందుకు ముందుకు వచ్చిన వ్యక్తి పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. ఒమ్మంగి, రాచపల్లి, శరభవరం రహదారులు చినుకుపడితేచిత్తడిగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే ఈ గ్రామంలో రహదారులు చెరువులా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పాలకులు స్పందించి గ్రామీణ రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గజ్జెనపూడి రోడ్డులో గోతులలో చేరిన వర్షం నీరు

2500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది పెద్దిపాలెం, కృష్ణవరం గ్రామాల్లో దాడులు నిర్వహించి 2500లీటర్లబెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెద్దిపాలెంలో నాటుసారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 1800లీటర్ల బెల్లపు ఊట, కృష్ణవరంలోని నాటు బట్టీలతో 700లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

'సొసైటీ అధ్యక్షుడి పదవి గిరిజనులకే ఇవ్వాలి'

రాజవొమ్మంగి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి సొసైటీ పరిధిలో పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగి 80 శాతంమంది గిరిజన ఓటర్లే ఉన్నారని అయినప్పటికీ ప్రతిసారీ సొసైటీ అధ్యక్షుడిగా మాత్రం గిరిజనేతరులే ఉంటున్నారని సొసైటీ డైరెక్టర్ గంపా నాగరాజు అన్నారు. ఆదివారం నాగరాజు పత్రికా ప్రకటనలో గిరిజనులు ఎల్లప్పుడూ సొసైటీ డైరెక్టర్‌లాగా మాత్రమే ఉంటున్నారని, ఎవరి బెదిరింపులకు తలొగ్గి గిరిజనేతరులకు పదవులు ఇస్తున్నారో బహిర్గతం చేయాలన్నారు. సొసైటీ అధ్యక్ష పదవి గిరిజనులకు ఇవ్వకపోతే సొసైటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను సమాచార హక్కుచట్టం ద్వారా సంపాదించి బట్టబయలు చేస్తామని నాగరాజు హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి గిరిజనులకే సొసైటీ అధ్యక్షుల పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ

గండేపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీ రాజాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉండవల్లి సూర్యభాస్కరరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన చిన్ననాటి మిత్రులు, గురువులు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు వృత్తి కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఎంతో మందిని తీర్చిదిద్దే అవకాశం ఒక ఉపాధ్యాయ వృత్తికి ఉందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో నాయక్, కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, చలగళ్ల దొరబాబు, పరిమిబాబు, బిక్కిన గంగాధర్, కంటిపూడి సత్యనారాయణ, కేతిన బాబి, బొల్లంరెడ్డి రామకృష్ణ, తాళ్లూరి మధుకుమార్, వెలమాటి కాశి, మద్దిపట్ల రామకృష్ణ, యూటీఎఫ్ నాయకులు లక్ష్మీదేవి, రాజబాబు, చావ సతీష్‌బాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరాడ క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట జట్టు విజయం



విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో ఈ నెల 12న ప్రారంభమైన కోరాడ సాయిరాం శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్లో 34 టీంలు పాల్గొనగా జగ్గంపేట టీం విన్నర్స్‌గా, గుర్రప్పాలెం టీం రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా గుర్రంపాలెం రోడ్డులోని బాలాజీ రైస్‌మిల్ ఎదురుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ప్రాంగణం వద్ద విజేతలకు బహుమతులు ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట టీడీపీ మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం హాజరయ్యారు. ముందుగా సాయిరాం శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులు చేతులమీదుగా విన్నర్స్‌గా నిలిచిన జగ్గంపేట టీంకు షీల్డ్‌తోపాటు 25,555లు నగదు బహుమతి అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన గుర్రపుపాలెం టీంకు రూ.15,555లు నగదుతోపాటు షీల్డ్‌ను అందజేశారు. 3వ ప్రైజ్ రూ.5,555లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ్రోతు శ్రీను, కొండ్రోతు ఫైడియ, ప్రేమ స్వరూప్ బుజ్జి, ఆర్గనైజింగ్ టీంఆలీషా, కిరణ్, పిలా మనికంఠ, జాన్, పప్పీ, రాజు పాల్గొన్నారు.

అసౌకర్యాల చెరలో ప్రత్తిపాడు హైస్కూల్

● ప్రహరీ లేక పాఠశాలలోకి పశువులు
● ఫర్నీచర్, ఉపాధ్యాయుల కొరత



ప్రహరీ లేక విశాలంగా ఉన్న ప్రత్తిపాడు హైస్కూల్

ప్రత్తిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని రెడ్డం రామమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసౌకర్యాల చెరలో కొట్టిమిట్టాడుతోంది. 650 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఫర్నీచర్, ఉపాధ్యాయుల కొరతతో పాటు ప్రహరీ లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతోంది. 6,7,8 తరగతుల విద్యార్థులు నేలపైనే కూర్చుని విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి ఉంది. 9,10 తరగతుల విద్యార్థులకు బెంచీలు ఏర్పాటుచేశారు. కేవలం 65 బెంచీలు ఈ హైస్కూల్లో ఉండటంవల్ల అత్యధిక విద్యార్థులు ఏళ్ల తరబడి నేలపైనే కూర్చుని విద్యాభ్యాసం చేస్తున్నారు. దీనికి తోడు హైస్కూల్‌కు చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంవల్ల పశువులు లోపలికి వచ్చేస్తున్నాయి. అలాగే మందుబాబులు రాత్రిళ్లు మద్యం తాగి సీసాలను హైస్కూల్ ప్రాంగణంలోనే వదిలేస్తున్నారు. సెలవురోజుల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా హైస్కూల్ మారుతుంది. పాఠశాల ప్రాంగణంలోకి దుండగులు చొరబడి మంచినీటి ట్యాంకులు, ట్యాప్‌లు, ఇతర సామాగ్రి దొంగతనం చేస్తున్నారు. 650మంది విద్యార్థులకు 25 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంకా సాంఘికశాస్త్రానికి ఇద్దరు, హిందీకి మరొకరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ హైస్కూల్ సమస్యలను ఎస్ఎఫ్ఐ నాయకులు, తల్లిదండ్రులు కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై స్కూల్ హెచ్ఎం జాన్‌ప్రసాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా హైస్కూల్ సమస్యలపై అధికారులకు మరోమారు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.



ప్రత్తిపాడు హైస్కూల్ ఎదురుగా అసంపూర్తిగా బేస్‌మెంట్ వేసిన దృశ్యం